క్లుప్తంగా

కార్పొరేటర్ పూర్ణిమ ఔదార్యం



కాంతమ్మకు నగదు అందజేస్తున్న శ్రీధర్

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం స్లీపర్స్ వీధిలో ఉంటున్న నూకవరపు కాంతమ్మ గత కొద్ది కాలంగా అనారోగ్యానికి గురి కావడంతో కూలి పనులకు వెళ్లలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. ఈ విషయం తెలుసుకున్న వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ కాంతమ్మను ఆదుకున్నారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ కాంతమ్మకు మందుల ఖర్చుల నిమిత్తం రూ. 3 వేలు నగదు, నిత్యావసర సరకులు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మకర్తల నియామకానికి వినతి



ఎండోమెంట్ కమిషనర్‌తో భేటీ అయిన ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : దేవదాయ శాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణతో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం భేటీ అయ్యారు. నియోజకవర్గ పరిధిలో గల పలు ఆలయాల్లో ధర్మకర్తలను నియమించాలని వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ పరిధిలో గల ఇసుకకొండ సత్యనారాయణస్వామి ఆలయం, వేంకటేశ్వరమెట్ట ఆలయం, ఎర్నిమాంబ, ఎరుకుమాంబ, ఎంబర్‌మన్నార్ ఆలయం, సూర్యాబాగ్ విశ్వేశ్వర స్వామి, టర్నర్ చౌల్ట్రీ, దుర్గాలమ్మ ఆలయం (ఒకరు), నీలమ్మ వేపచెట్టు (ఇద్దరు) ఆలయాలకు ధర్మకర్తలను నియమించాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కొల్లి సింహాచలం

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 39వ వార్డులోని శెట్టి బలిజ కమ్యూనిటీ హాల్లో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వేదాంత కార్గో, ఎఫ్‌ఎక్స్‌బీ ఇండియా సురక్ష స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా నిర్వహించిన వైద్య శిబిరాన్ని కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్, నియోజకవర్గ క్లస్టర్ (36, 38, 39 వార్డులు)అధ్యక్షురాలు కొల్లి సింహాచలం ప్రారంభించారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, స్థానికులు పాల్గొన్నారు.

పార్వతీ తనయునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అల్లూరి వీధి గణేశుడు



దొండపర్తి కుప్పిలివారివీధిలో యూత్‌స్టార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

సీతమ్మధార : దొండపర్తి కుప్పిలివారివీధిలో యూత్‌స్టార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గణపతి మండపం ఆవరణలో పెద్ద ఎత్తున కుంకుమ పూజలు నిర్వహించారు. అప్పన్న పంతులు ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

గణపతికి గరికపూజ..

దొండపర్తిలోని అల్లూరి వీధిలో బాల గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో గణపతికి గరికి పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అదే విధంగా కుంకుమ పూజ, సహస్ర దీపారాధన, రుద్రాభిషేకం, లక్ష్మీ గణపతి హోమం జరిపించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈనెల 30వ తేదీన నిమజ్జన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

రాజగణపతి అలంకరణలో..

ఆశీలమెట్టలోని సంపత్ వినాయగర్ ఆలయంలో రాజగణపతి అలంకరణలో సంపత్ వినాయగర్ భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. గణపతి హోమం, నాదస్వర కచేరి, సర్వదర్శనం అనంతరం నారాయణ సేవ నిర్వహించినట్టు ప్రధాన అర్చకులు మోహన్‌స్వామి తెలిపారు.



రాజగణపతి అలంకరణలో సంపత్ వినాయగర్

పూర్ణామార్కెట్ గణపతికి విశేష పూజలు..

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 35వ వార్డులోని పూర్ణామార్కెట్ వర్తక సంఘం ఏర్పాటు చేసిన మహాగణపతిని ఆ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దుర్గాలమ్మ దేవస్థానం ధర్మకర్తలు బత్తి మంగరాజు, కాంగ్రేగుల రూపావతి, వర్తక సంఘం అధ్యక్షుడు, సెక్రటరీ, కార్యవర్గ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పూర్ణామార్కెట్ మహాగణపతికి పూజలు చేస్తున్న కార్పొరేటర్ విల్లూరి

దుర్గాలమ్మ ఆలయంలో మహాన్నదానం



అన్నసమారాధన ప్రారంభిస్తున్న కార్పొరేటర్ విల్లూరి, ధర్మకర్తల మండలి చైర్మన్ మల్లిబాబు

డాబాగార్డెన్స్ : దుర్గాలమ్మ ఆలయంలో శుక్రవారం మహాన్నదాన కార్యక్రమం చేపట్టారు. వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు పాల్గొని దుర్గాలమ్మకు ప్రత్యేక పూజలు చేసి, మహాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి దేవస్థానంలో ప్రతి శుక్రవారం నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమానికి దాతలు ముందుకొచ్చి సహాయ సహకారాలు అందివ్వాలన్నారు. ఇందుకు గాను భక్తులు దేవస్థానం చైర్మన్‌ను కలవాలన్నారు. భక్తులు కోరిన మేరకు అన్నదాన కార్యక్రమం నిర్వహణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చైర్మన్ నాయన మల్లిబాబు, ధర్మకర్తలు బి. మంగరాజు, కాంగ్రేగుల రూపావతి, కె. వరలక్ష్మి, దళమంతుల చిన్ని, సారిపల్లి వెంకటలక్ష్మి, ధవళ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా ఆకర్ష జోన్ పనులు



నక్కవానిపాలెంలో ఆకర్ష జోన్ పనులను పరిశీలిస్తున్న జీవీఎంసీ అధికారులు

సీతమ్మధార: నక్కవానిపాలెంలో అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలం నుంచి సీతమ్మధార రైతుబజార్ వరకు ఆకర్ష జోన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వీటిని శుక్రవారం జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, ఏఈ శ్రీరామమూర్తి తదితరులు పరిశీలించారు. గతంలో జీవీఎంసీ కమిషనర్ త్వరితగతిన ఆకర్ష జోన్ పనులు నిర్వహించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు.

మహిళా బిల్లు గాలిబుడగ వంటిది



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మహిళా సంఘాల నాయకులు

సీతమ్మధార : కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లు పేరుతో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 128వ రాజ్యాంగ సవరణ బిల్లు గాలిబుడగ వంటిదని అఖిలభారత మహిళా సంఘాల సమన్వయ కమిటీ ఆంధ్రప్రదేశ్ నాయకురాలు ఎం.లక్ష్మి అన్నారు. శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. బీజేపీ ఎన్నికల సందర్భంగా మహిళలకు ఇచ్చిన హామీల మాదిరే ఇది కూడా నమ్మకద్రోహం చేసేదిగా ఉందన్నారు. 2024లో జరగబోయే లోక్ సభ ఎన్నికలను ఉద్దేశించి తెచ్చారని అన్నారు. చాలా కాలంగా మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్ ఉందన్నారు. మోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో మహిళలపై హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయని అన్నారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో మోదీ ప్రభుత్వం ఈ బిల్లును సవరించి తిరిగి ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

గర్భిణులకు డ్రై ఫ్రూట్స్ పంపిణీ



డ్రైఫ్రూట్స్ అందుకున్న గర్భిణులు, బాలింతలతో అమెజాన్ టీం

మద్దిలపాలెం: అమెజాన్ సంస్థ 'గ్లోబల్ మంత్ వాలంటీరింగ్ ఈవెంట్' పేరిట శుక్రవారం సేవా కార్యక్రమం నిర్వహించింది. 51వ వార్డు గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు సంస్థ ప్రతినిధులు డ్రైఫ్రూట్స్ పంపిణీ చేశారు. ప్రతి ఏడాది గ్లోబల్ మంత్ వాలంటీరింగ్ ఈవెంట్ పేరిట సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అమెజాన్ సంస్థ ప్రతినిధి తనూజ తెలిపారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలకు విటమిన్స్‌తో కూడిన పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. టీం సభ్యులు కొండలరావు, నరేంద్ర, అంగన్‌వాడీ టీచర్ మౌలాబీబీ పాల్గొన్నారు.

మానసిక ఆస్పత్రికి అదనపు హంగులు



ఆస్పత్రి సూపరింటెండెంట్ రామిరెడ్డికి భవనాలు పేపర్లు అప్పగిస్తున్న ఏఈ నాయుడు



నూతనంగా నిర్మించిన భవనాలు

- రూ.30 కోట్లతో పలు భవనాల నిర్మాణం పూర్తి

ఏయూక్యాంపస్: ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో అధునాతన భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా రూ.30 కోట్ల వ్యయంతో 20 పడకల చిన్న పిల్లల మానసిక వైద్య విభాగం, 20 పడకల వృద్ధుల మానసిక వైద్య విభాగం, 40 పడకల డి అడిక్షన్ విభాగం, సరికొత్తగా పునరావాస కేంద్రం, పీజీ విద్యార్థుల హాస్టల్, అధునాతన సమావేశ మందిరాలతో కూడిన అకడమిక్ బ్లాక్‌ను ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు, మౌలిక వసతుల కల్పనా సంస్థ(ఏపీఎంఎస్ఐడీసీ) నిర్మించింది. ఈ భవనాలను అధికారికంగా శుక్రవారం సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.నాయుడు ఆస్పత్రి సూపరింటెంటెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డికి అప్పగించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ కొత్తగా సమకూరిన మౌలిక వసతులతో ఆస్పత్రి సేవలు మరింత విస్తృతం అవుతాయన్నారు. త్వరలోనే ఫర్నిచర్ ఏర్పాటు చేసి.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ భవనాలను ప్రారంభిస్తామని వెల్లడించారు. ఆస్పత్రి అభివృద్ధికి నిధులు అందించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవుడికి సుప్రభాత సేవ నేడు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించనున్నారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన జరగనుంది.

స్కూల్ గేమ్స్ సందడి

- ముగిసిన నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు



కబడ్డీలో తలపడుతున్న బాలురు



ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్ గ్రౌండ్‌లో షటిల్ ఆడుతున్న బాలురు

సీతంపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీలు శుక్రవారంతో ముగిశాయి. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ గ్రౌండ్‌లో ఉత్తర నియోజకవర్గ స్థాయిలో రెండో రోజు బాలురకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో గెలుపొందిన అండర్-14, అండర్-17 బాలురు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. నియోజకవర్గంలోని పాలాక్స్, హరగోపాల్, ఎన్జీజీవోస్ కాలనీ, మాధవధార, కె.కాలనీ, కప్పరాడ జీవీఎంసీ హైస్కూల్స్, శారదా స్కూల్, ఎస్.ఎస్.వి.ఎన్.స్కూల్‌కు చెందిన 150 మంది విద్యార్థులు పోటాపోటీగా ఆడారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్, యోగా, షాట్‌పుట్, డిస్కత్రో, 100, 200, 400 మీటర్ల రన్నింగ్ పోటీలు జరిగాయి. స్కూల్ గేమ్స్‌తో ఎన్జీజీవోస్ కాలనీ పాఠశాల మైదానంలో సందడి వాతావరణం నెలకొంది. మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని శాంతి కుమారి పోటీలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎన్జీజీవోస్ స్కూల్ హెచ్ఎం లక్ష్మీ నరస, పీడీలు సునంద్, తబిత, పీఈటీలు త్రినాథ్, సురేష్, శారద, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

'బాలభాను' విద్యార్థుల ప్రతిభ

మురళీనగర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో మురళీనగర్ బాలభాను విద్యాలయం విద్యార్థులు ప్రతిభ చూపారు. యోగా పోటీల్లో అండర్-17 విభాగంలో ఎస్.హెచ్.హిమాంబి, అండర్-14 విభాగంలో లక్ష్మి, అమృత, ముత్య జిల్లా స్థాయిలో ఎంపికయ్యారు. బాలికల విభాగంలో 400 మీటర్ల రన్‌లో పి.విద్యాప్రజాపతి మొదటి స్థానంలో నిలవగా.. 200 మీటర్ల పరుగు పోటీల్లో ఎం.రోహిత్, సాయి సూర్య ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బీఆర్‌కే రాజు, ప్రిన్సిపాల్ శుభశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ టి.మనోరమణి, వ్యాయామ ఉపాధ్యాయుడు సిహెచ్.రమణారావు విద్యార్థులను అభినందించారు.

మత్స్యకారులకు అండగా సీఎం జగన్

- 34వ వార్డులో కొత్తగా మంజూరైన మత్స్యకార పింఛన్ల పంపిణీ
- ముఖ్యమంత్రికి లబ్ధిదారుల కృతజ్ఞతలు



కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి

అల్లిపురం : జీవీఎంసీ 34వ వార్డులో కొత్తగా మంజూరైన మత్స్యకార పింఛన్లను వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి లబ్ధిదారులకు అందజేశారు. జగనన్న పింఛన్ కానుక ద్వారా 50 సంవత్సరాలు నిండిన మత్స్యకారులకు పింఛన్లు మంజూరు చేయడం ద్వారా వారికి అండగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. ప్రజా సంక్షేమ పథకాలు గత నాలుగేళ్లలో అమలు చేసి ముఖ్యమంత్రి ప్రజల మనసుల్లో నిలిచిపోయారన్నారు. నిత్యం పేద ప్రజల సంక్షేమం కోసం ఆలోచిస్తూనే ఉంటారన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు దూడ అప్పారావు, పిల్లి సత్తిబాబు, అనిల్, నర్సింగరావు, రవి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీలో క్రికెట్ టోర్నీ ప్రారంభం



గంట్ల శ్రీనుబాబును సత్కరిస్తున్న చిన్నా మెమోరియల్ క్రికెట్ టోర్నీ నిర్వాహకులు

మహారాణిపేట : జర్నలిస్టుల క్రీడలు అభినందనీయమని, ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తి ప్రదర్శించి అందరి మన్ననలు పొందాలని సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు అన్నారు. విశాఖ వెబ్ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మొదలైన క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో చిన్నా మెమోరియల్ క్రికెట్ టోర్నీ పేరిట రెండు రోజుల పాటు జరగనున్న ఈ క్రీడల్లో వివిధ ప్రాంతాలకు చెందిన ఏడు జట్లు పాల్గొంటున్నాయి. కార్యక్రమంలో భాగంగా నిర్వాహకులు శ్రీనుబాబును ఘనంగా సత్కరించారు. రామకృష్ణ, మోహన్, సతీష్, నాగరాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కృష్ణకు ఆర్థిక సహకారం



కృష్ణకు ఆర్థిక సహకారం అందజేస్తున్న సీపీ డాక్టర్ రవిశంకర్, దివీస్ జనరల్ మేనేజర్ కోటేశ్వరరావు

అల్లిపురం : నగర పోలీస్ కమిషనరేట్ సీటీసీలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న పరవాడ కృష్ణ ఈ ఏడాది డిసెంబర్ 4వ తేదీన వెస్ట్రన్ ఆస్ట్రేలియా, పెర్త్‌లో జరిగే ప్రపంచ ఐరన్ మ్యాన్ పోటీల్లో పాల్గొననున్నారు. కృష్ణను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ప్రోత్సహిస్తూ అందుకు ఆర్థిక సహకారం అందించాలని దివీస్ సంస్థను కోరారు. ఈ మేరకు దివీస్ సంస్థ జనరల్ మేనేజర్ వై.ఎస్.కోటేశ్వరరావు శుక్రవారం కమిషనర్ చేతుల మీదుగా పరవాడ కృష్ణకు రూ.5 లక్షల 75 వేలు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కృష్ణ అనేక సార్లు ప్రపంచ ఐరన్ మ్యాన్ పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. 2018 బార్సిలోనాలో నిర్వహించిన అంతర్జాతీయ పోటీలో పాల్గొని 3 వేల మందిలో 125వ స్థానం దక్కించుకోవడం విశేషం అన్నారు. కృష్ణ పోటీల్లో పాల్గొనడానికి అయ్యే ఖర్చును దివీస్ యాజమాన్యం భరించనుండటం పట్ల కమిషనర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో దివీస్ ప్రతినిధులు వరహాలరెడ్డి, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సేవలందించాలి

- అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవు
- సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి



అధికారులతో కలిసి పర్యటిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి దేవస్థానం అధికారులను ఆదేశించారు. సింహగిరిపై శుక్రవారం ఆయన దేవస్థానం ఇంజినీరింగ్ విభాగం, ఆలయ అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. ముఖ్యంగా భక్తులకు మంచినీరు విరివిగా అందించే చర్యలుతీసుకోవాలని, పారిశుధ్యం మెరుగుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. అన్నప్రసాదం విభాగాన్ని పరిశీలించారు. సింహగిరికి వచ్చే ఏ ఒక్క భక్తుడు ఇబ్బందికి గురికాకుండా చూడాలని, అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఈఈ రాంబాబు, డీఈ నాగేశ్వరరావు, ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు,ఏఈ హరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, పీఆర్వో నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న విద్యార్థులు. చిత్రంలో ఉపకులపతి ఆచార్య శ్రీసుధ తదితరులు

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయ 16వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని వర్సిటీలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. వర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో లయన్స్ బ్లడ్ బ్యాంకు సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని వర్సిటీ ఉపకులపతి ఆచార్య డాక్టర్ శ్రీసుధ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదానం చేసి.. ప్రాణదాతలుగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. ఈ శిబిరంలో 100 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. రిజిస్ట్రార్ డాక్టర్ జోగినాయుడు, సమన్వయకర్త డాక్టర్ విశ్వచంద్ర, నిర్మలాదేవి, పీడీ ఓఎం రాజు, లయన్స్ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి సుధాకర్, డాక్టర్ దీప్తి తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM

IA 727 /2023 IA 728/2023
IA 729/2023 IN OS 1194/2008

Between:
V.SRINIVAS RAO @ SRINIVAS ... **Plaintiff**
And
B.SURIBABU and OTHERS ...**Defendants**

NOTICE

To
R1. Botta Suri babu S/o. Late Sriramulu. D.No.18-54-10/6, 1st. floor. Thadhi Veedhi, Maharani Peta Visakhapatnam.
R4 Burgubilli Aruna alias Yellamma W/o Ramesh Babu P&T Quarters, Dandu Bazar Flat No 9, Maharani Peta, Visakhapatnam
R7 Samanthapudi Prasad R/at D/No 18-54-10/6, Thadhiveedhi Maharani Peta Visakhapatnam.
R8 Samanthapudi Srinivas Rao alias Vikki Maharani Peta Visakhapatnam.
R9 Samanthapudi Durga Prasad R/D/ No.18-54-10/6, Thadhiveedhi, Maharani Peta Visakhapatnam.

Take Notice that the plaintiff filled above IA 727/2023 for condonation of delay in filing application to set aside abetment order. IA 728/2023 To set a side abetment order IA 729/2023 To Implead legal heirs of deleased 3rd defendant S.Applakonda. All the petitions posted for your appearance on 05.10.2023.
R1,R4,R7,R8, and R9, before the above court. You are therefore ordered to appear before the above court on the above date by10.30am personally or through advocate without fail Indefault the matter will be decided basing on record

D.SANDHYA RANI, Advocate
VISAKHAPATNAM, Cell : **8885050779**

ఉత్తమ ఆచార్యులకు అభినందన

ఏయూ క్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఆచార్య పురస్కారాలు అందుకున్న ఆచార్యులను ఏయూ వీసీ పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి శుక్రవారం అభినందించారు. ఈ మేరకు వీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆచార్య ఎస్.కిషోర్ బాబు, ఆచార్య పి.శ్యామల, ఆచార్య సి.వి.నాయుడు, ఆచార్య కె.సీతామాణిక్యం, ఆచార్య కె.రమాసుధ, ఆచార్య డి.లలిత భాస్కరిలను సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

సింహాచలం:శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణతో కల్యాణం చేశారు.